ఘనంగా భోగి


పెద్దపంజాణి: రాయలపేటలో వేసిన భోగి మంటలు

- ఇళ్ల ముందు గొబ్బెమ్మలతో అలంకరణలు
- నేడు సంక్రాంతికి సర్వం సిద్ధం
- కనుమ కోసం పశువులకు అలంకరణలు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో పల్లెల్లో సంక్రాంతి శోభ మొదలైంది. ఆదివారం భోగిపండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచారు. మరోవైపు గ్రామాల్లోని ఆలయాల ముందు భోగిమంటలు వేశారు. పట్టణంలోని పలు చోట్ల చిట్లాకంపలతో భోగి మంటలేశారు. సోమవారం సంక్రాంతి పండుగ వేడుకలకు సన్నద్ధమయ్యారు. తెలుగు వారి ఆచార, సాంప్రదాయలను ప్రతి బింబించే పండుగల్లో సంక్రాంతి అతి ముఖ్యమైంది. ఆలయాల్లో గోదా దేవి పూజలను ఘనంగా నిర్వహించనున్నారు. కనుమ రోజు ఎద్లను అలంకరించేందుకు రైతులు సిద్ధమయ్యారు. వీటి సింగారానికి అవసరమైన కలర్లు, రంగు పేపర్లు, బెలూన్లు, మెడగంటలు, ప్రభలను ఇప్పటికే రైతులు కొనుగోలు చేశారు. మరోవైపు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తన స్వగ్రామంలో భోగిమంటలను వేశారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో తెల్లవారుజామునే పెద్దలు, పిల్లలు ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు.. కష్టాలన్నీ భోగిమంటల్లో కలసిపోవాలంటూ పాత వస్తువులను దహనం చేశారు. మహిళలు ఇళ్ల ముందు, లోగిళ్లలో గొబ్బెమ్మలు పెట్టి పసుపు, కుంకుమ పూసి, వాటికి తంగేడు పూలు పెట్టి, సంప్రదాయంగా పూజలు చేశారు. తమ జీవితాల్లో చెడులన్నీ తొలగిపోయి అంతా మంచి జరగాలని కోరుకున్నారు. దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడాయి.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: పల్లెల్లో సంక్రాంతి సందడి భోగిపండుగతో మొదలైంది. ఆదివారం ఉదయం భోగిమంటలు, రంగవల్లులతో ఎక్కడ చూసినా కోలాహలం నెలకొంది. తెలుగు వారి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ప్రతి ఇల్లూ బంధువులు, స్నేహితులతో సందడిగా మారింది. పొగమంచుతో పాటు తెల్లవారు జాము నుంచి చలి బాగా పెరిగింది. పిడకలు, పాత వస్తువులను భోగి మంటల్లో వేసి కుటుంబ సమేతంగా మంట చుట్టూ తిరిగారు.


పుంగనూరులో..

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ



పలమనేరు: సిరిసంపదలతో సంక్రాంతిని, కోలాహలంగా కనుమ పండుగలను నియోజకవర్గ ప్రజలు జరుపుకోవాలని, ఈ సంక్రాంతి అందరి లోగిళ్లలో సంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ ఆదివారం ఓ ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పుంగనూరు: పట్టణం, మండల వ్యాప్తంగా ఆదివారం భోగిపండుగను ఘనంగా నిర్వహించారు. వేకువ జామున ఇళ్ల ముందు భోగిమంటలు వేశారు. పేడతో అలికి, గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. మూడు రోజుల పాటు కనుమ, సంక్రాంతి పండగలను గ్రామీణ ప్రాంతాలలో వేడుకగా నిర్వహించడం పరిపాటి. ఈ పండుగ వేడుకల్లో మొదటిదైన భోగిపండుగను పురస్కరించుకుని పితృదేవతలకు తర్పణాలు వదలడం, పొలాలకు వెళ్లి భూమికి, పంటలకు పూజలు చేయడం, గంగిరెద్దుల వేషధారణలో పశువులను గ్రామాల్లోకి తీసుకెళ్లి భిక్షాటన చేయడం ఆనవాయితీ. దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారితో పలు గ్రామాలు సందడి.. సందడిగా మారాయి.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల వ్యాప్తంగా భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఐదు గంటలకే వయోభేదంతో నిమిత్తం లేకుండా ఆనందోత్సవాల నడుమ భోగిమంటలు వేశారు.


పలమనేరు: భోగిమంటలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): ఆదివారం మండల వ్యాప్తంగా భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఇళ్ల ముందు భోగిమంటలు వేసి చలికాచుకున్నారు. బంధుమిత్రులతో కలసి పండుగను వేడుకగా జరుపుకున్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మూడు రోజుల సంక్రాంతి పండుగలో భాగంగా మొదటి రోజు ఆదివారం ఉదయం భోగి పండుగను ప్రజలు జరుపుకున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. భోగి మంటలో పరకలు, చాటలు, పుడకలు, ఆవు పిడకలు, ఇంట్లోని పాత వస్తువులను వేసి దహనం చేశారు.

కుప్పంలో..

కుప్పం: భోగి పండుగను మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లముందు వేకువజామున భోగిమంటలు వేసి, చుట్టూ కలియతిరుగుతూ సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఇక, పండుగ పురస్కరించుకుని అవసరమైన వాటి కొనుగోళ్లకు వచ్చిన ప్రజలతో కుప్పంలోని దుకాణాలు కిక్కిరిశాయి. ప్రధానంగా సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున పొంగళ్లు, ఆ తర్వాత కనుమపండుగ రోజున పశువుల పరుగు పందేల నిర్వహణ ఏర్పాట్లపై యువత నిమగ్నమైంది. పట్టణంలో పండుగ నిర్వహణకు చెరకు, పసుపు మొక్కలు, రంగవల్లుల కోసం రంగులు, పశువులను అలకరించేందుకు రంగు రంగుల కాగితాలు, పవ్వులు మార్కెట్‌లో జోరుగా వ్యాపారాలు సాగుతున్నాయి.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

కుప్పం: రాబోవు కుప్పం అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. ఆదివారం ఆమె 25 వార్డు లక్ష్మీపురంలోని వరదరాజుల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్రాతి పండుగ పర్వదినం సందర్భంగా చీరలు, పసుపు, కుంకుమ, గాజులను మహిళలకు అందజేశారు. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తమ కుటుంబం కోరుకుంటోందన్నారు. అలాగే జగనన్న ప్రభుత్వం రాజకీయాలు, పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి చేసిన మేలును దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో తమ కుటుంబానికి ఆశీస్సులు ఇవ్వాలని అభ్యర్థించారు. తమ కుటుంబం స్థానికంగా నివాసం ఉంటూ, ప్రజలతో మమేకమైందని, భరత్ తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను ఎన్నో పరిష్కరించారని గుర్తు చేశారు. మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కడితే సంక్షేమం నిరంతరం కొనసాగడమే కాకుండా అభివృద్ధి కూడా అదే తీరులో పరుగులు తీస్తుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మంజుల, రెస్కో చైర్మన్ సెంధిల్ కుమార్ , స్థానిక నాయకులు పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో మహిళలకు చీరలు అందజేస్తున్న దుర్గ

క్లుప్తంగా

మంత్రి పరామర్శ


స్విమ్స్‌లో రెడ్డీశ్వర్‌రెడ్డిని పరామర్శించిన మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డిని రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం ఇంటి వద్ద జెర్సీ ఆవులకు ఆయన మెషిన్‌తో గడ్డి కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చెయ్యి రెండు వేళ్లు తెగి పడ్డాయి. దీంతో వెంటనే స్విమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు శనివారం ఆపరేషన్ చేసి రెండు వేళ్లను పూర్తిగా తొలగించారు. ఇది తెలుసుకున్న మంత్రి పెద్దిరెడ్డి అక్కడికి వెళ్లి రెడ్డీశ్వర్ రెడ్డిని పరామర్శించారు. పరిస్థితి ఎలా ఉందో వైద్యులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి కూడా రెడ్డీశ్వర్ రెడ్డిని ఆదివారం ఉదయం పరామర్శించారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

పలమనేరు: పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, మండీ సుధా ఆదివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. ఆయనకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. స్థానిక ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌కుమార్ రెడ్డి, నాయకులు రాజేష్,మున్సిపల్ వైస్ చైర్మన్ రవి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి

సదుం: మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూచించినట్టు జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ స్వగృహంలో మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో కాణిపాక ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు పొంగళ్లు



చౌడేపల్లె: మండలంలో చిట్రెడ్డిపల్లెలోని గ్రామదేవత బోయకొండ గంగమ్మకు ఆదివారం పొంగళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, జంతు సంపద, వృద్ధిచెందడడంతోపాటు ప్రజలు సుభిక్షంగా ఉండాలని గ్రామదేవతకు పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో చలువ కుండలు, దీపాలతో పాటు అమ్మవారికి కొత్త బట్టలు సమర్పించారు.

విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

గంగవరం: మండల కేంద్రంతోపాటు కల్లుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం ట్యాబ్స్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు, విద్యాబోధన, విద్యార్థుల భవిష్యత్‌ను చక్కదిద్ది ప్రతిఒక్కరినీ ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రతి విద్యార్థి జగనన్న ఆశయాలకు అనుగుణంగా చదువులు పూర్తి చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతి రెడ్డి, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎంలు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత


మాదేష్‌కు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న పద్మమ్మ, స్థానిక నాయకులు

కుప్పం రూరల్: మండలంలోని గుడ్లనాయనపల్లెకు చెందిన మాదేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు నిరుపేద మాదేష్‌కు సీ ఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయించడంతో నెల లోనే రూ.1,40,000 చెక్కు మంజూరైంది. ఆదివారం ఈ చెక్కును చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అమ్మ పద్మమ్మ మాదేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గిరిప్రసాద్, కదిరివేలు, శ్రీనివాసులు, గణపతి, గోవిందు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులను కలిసేందుకు ఊరునాయునిపల్లెకు వెళ్లి పద్మమ్మకు స్థానిక పార్టీ నాయకులు శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ భవనాన్ని ఆమెకు చూపించారు. స్పందించిన ఆమె తన సొంత సొమ్ము వెచ్చించి మరమ్మతులు చేయించారు. ఆదివారం పనులు పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పునః ప్రారంభించారు.

క్రికెట్ విజేత చుక్కలవారిపల్లె జట్టు


విన్నర్స్‌గా నిలిచిన పీసీబీ కుర్రాళ్ల జట్టు

చౌడేపల్లె: మండలంలోని దాదేపల్లె గ్రామ సమీపంలో క్షత్రియ ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలకు వివిధ గ్రామాల జట్లు తమ ప్రతిభను చాటాయి. విన్నర్స్, రన్నర్స్‌తోపాటు ప్రతిభ చాటిన క్రికెటర్లకు నిర్వాహకులు పురుషోత్తంరాజు, శ్రీనివాసురాజు, భాస్కర్‌రాజు బహుమతులు అందజేశారు. విన్నర్స్‌గా నిలిచిన పీసీబీ కుర్రాళ్ల జట్టు (చుక్కవారిపల్లె) రూ.లక్ష, రన్నర్స్‌గా నిలిచిన పీఎస్‌పీ హాక్స్ (పాపిశెట్టిపల్లె)జట్టు రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50లను కేవీపీ కింగ్స్ (కొత్తవీరప్పల్లె) జట్టు క్రీడాకారులు అందుకున్నారు. వీటితోపాటు టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పీసీబీ కుర్రాళ్ల జట్టుకు చెందిన డీఎస్.పవన్‌కుమార్ రాజుకు మోటార్ సైకిల్, బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్ ప్రేమ్‌కుమార్ ఎల్ఈడీ టీవీఅ, బెస్ట్ ఆఫ్ ది ప్లేయర్‌గా అఖిల్‌కు ల్యాప్‌టాప్‌తోపాటు జ్ఞాపికలను అందజేశారు. అలాగే బ్యాడ్మింటన్ టోర్నీ డబుల్స్‌లో విన్నర్స్‌గా నిలిచిన బెంగళూరుకు చెందిన కిరణ్, జీవన్‌లకు రూ.30 వేలు, రన్నర్స్‌గా నిలిచిన పుంగనూరుకు చెందిన నారాయణరాజు, వంశీ రాజుకు రూ.20 వేలను బహుమతిగా అందజేశారు.

ఆర్థిక సాయం



రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ కొతారిగడ్డ గ్రామానికి చెందిన నారాయణ స్వామి, బగళనత్తం గ్రామానికి చెందిన మునుస్వామినాయుడు ఆదివారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్థానిక ఎంపీపీ సుబ్రమణ్యం,సర్పంచ్ రాజ్‌గోపాల్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. మృతుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ ఆదుకుంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక నేతలు సురేంద్ర రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆవుదూడ సమర్పణ


చైర్మన్‌కు ఆవుదూడను అందజేస్తున్న రేవంత్

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెకు చెందిన రేవంత్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.50వేల విలువైన ఆవు, దూడను విరాళంగా సమర్పించినట్టు ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. కోరిన కోర్కెలు ఫలించడంతో కుటుంబ సమేతంగా హాజరై ఆయన ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించినట్టు చెప్పారు. చైర్మన్‌తోపాటు పాలక మండలి సభ్యుడు పవన్‌కుమార్ వారిని సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.